# "రాజమండ్రీ వెళ్ళబోకు రంగుబట్టా కట్టబోకు"

"రాజమండ్రీ వెళ్ళబోకు, రంగుబట్ట కట్టబోకు...పాడైపోతావు రా నాయనా..." అని నా చిన్నతనంలో మా ఇంట్లో పనిచేసే కుర్రవాడు కాలక్షేపం కోసం పాడుకునే మాటలు నా బుర్రని గట్టిగా పట్టుకుని వుండడం వల్లనేమో, నాకు రాజమండ్రి వెళ్ళడమంటే మనసు ఒప్పుకోదు. వీలయినంతవరకు వెళ్ళడం మానుకుంటాను. తప్పనిసరి అయితే ముక్తసరిగా పనిచూసుకొని రైల్లో పడే తత్వం నాది. ఏవేవో కొన్ని కారణాలు నేతిలా పేరుకొని రాజమండ్రి పేరులోనే అసహ్యం వున్నట్లు స్థిరాభిప్రాయం ఒకటి ఏర్పడిపోయింది.

## విషయానుక్రమణిక

ముఖచిత్రం:—శ్రీ రాజరాజేశ్వరీవారి "సతి సక్కుబాయి"లో ఎస్. వరలక్ష్మి.


| | |
|---|---|
| "రాజమండ్రీ వెళ్ళబోకు రంగుబట్టా కట్టాబోకు— | 2 |
| శిల్పానికి చక్కిలిగింతలు— | 5 |
| "యమధర్మరాజుగారు నమిలి మింగిన తెలకపిండి— | 12 |
| సందేశం— | 23 |
| దెబ్బతిన్న అహంకారం | 24 |
| వనితాలోకం— | 30 |
| బొమ్మరిల్లు— | 36 |
| టామ్‌సాయర్ ప్రపంచయాత్ర— | 38 |
| నాన్నముద్దు— | 42 |
| ప్రతిఫలం— | 44 |
| విజ్ఞానవీథులు— | 47 |
| సినిమా— | 49 |


నిష్పక్షపాతంగా ఆలోచిస్తే రాజమండ్రీలాంటి వూరులేదు. గంగానదికి అప్పగారైన గోదావరిలో పుట్టుకనుంచీ చరిత్ర ప్రవహిస్తూంది. కనపడవు గాని కోటిలింగాలు కలిగి దక్షిణకాశి అనిపించుకుంది. కోటిలింగాలదగ్గర కనపడేది ఇప్పుడు ఒక్కటే - ఒకరు చెప్పినట్లు - బొబ్బర్లంక వరకూ గొట్టం కనపడే పేపరుమిల్లు. కాని ఆ గొట్టంలోంచి గుప్పెడు పొగైనా ఇంతవరకు పైకిరాలేదుట. మనదేశంలో చెప్పుకో

ఐ పో లా

వలసిన రైలు వంతెనల్లో ఒకటి రాజమండ్రీలో వుంది. రాజరాజనరేంద్రుని కోటగుమ్మం సరిగా ఇప్పటి బజారుమొగలో వుంది; కోటగుమ్మం లేదు కాని ఆ స్థలం వుంది. రాజరాజనరేంద్రుడు, నన్నయార్యుడు సాయంత్రం లంక కోటాకు చుట్టలు వెలిగించి వాహ్యాళికి వెళ్ళిన గోదావరిగట్టు ఇప్పటికీ వుంది.

తెలవారేటప్పటికి అప్పుడు తోటలో కోసిన నవనవలాడే వంకాయలు, గోంగూర, వీధుల్లోకి గడపదగ్గరికి వస్తాయి. యిక్కడ దొరకని కూరలు, పళ్ళు, తదితర వస్తువులు ఎక్కడా దొరకవు. రాజమండ్రి ఆంధ్రదేశానికి ఒకప్పుడు రాజధాని, రాజకీయంగాను చారిత్రకంగానూ. నేడు కళలకీ కవితకీ సంస్కృతికీ రాజధాని. కళలకు పుట్టినిల్లు రాజమండ్రి. శ్రీనాథుడు వేసుకునే శృంగార తాంబూలము ఇప్పటికీ బజారులో దొరుకుతుంది!

ఇటువంటి పట్టణమంటే కోపమెందుకో అనిపించుతుంది. నా అనుభవాన్ని గురించి చెప్పుతాను. ఒకసారి తప్పనిసరిగా రాజమండ్రీ వెళ్ళవలసివచ్చి రైల్లోపడ్డాను. ఇష్టంలేని ప్రయాణం కనుక ఒకమూల ఎవరితో మాట్లాడకుండా పత్రిక చదువుకుంటూ కూర్చున్నాను. నాపక్క అతను తనపక్క అతనితో ఏదో కాలక్షేపంకోసమన్నట్లు 'ఏ వూరు మనది' అన్నాడు. దానికి జవాబు వచ్చిన తక్షణం "ఏవూరు వెళ్ళాలి" అన్నాడు. 'రాజమండ్రీ' అని సమాధానం వచ్చింది.

'ఎక్కడ దిగుతావు. గోదావరిలో నా వూళ్లోనా' అని మూడో ప్రశ్న. ఈప్రశ్న విని నేను ఉలిక్కిపడ్డాను. కొత్తగా రాజమండ్రీ వెళ్ళేవాడికి ఇదొక అవస్థ.

సరే, రాజమండ్రీలో దిగాను. బజారుకి వెళ్ళాలి. మార్కెట్ దాకా వచ్చాను. అడ్డంగా అరటి గెలలు వేసుకొని రెండెడ్ల బండి వస్తూంది. ఇటుపక్కనుంచి బండికెదురుగా సైకిలు ఒకటి బ్రేకులు పనిచేయని దనుకుంటాను—వచ్చేస్తోంది. ఎదురుగా ఒక మనిషి నా ముఖాని కెదురుగా ముఖం వుంచి నించున్నాడు, ఎవరు వాడుగో తెలుసుకోడానికన్నట్లు. ఎల్లాగా నడవడం? కొంచెం వెనక్కి తప్పుకుందామనుకుంటూంటే, ఆబోతొకటి వ్యక్తిగౌరవాన్ని లెక్కించక వెనకనుంచి వచ్చి తన పొట్టతోటి రెండెడ్లబండిమైపు గెంటింది నన్ను. ఇంతలో పోలీసు కానిస్టేబులు నన్నివతలకు లాగి "ఏం భూమ్మీద విరక్తి పుట్టిందా?" అని అడిగాడు.

అప్పటినుంచే బజారు మొదలౌతుంది. భూమి ఈనినట్లుంటుంది బజారెప్పుడూ. అక్కడ నడవడం అతికష్టం. మా మిత్రుడొకడు వాదించినట్లు నడిచే మనిషికికూడా గంట అవసరం. నా వుద్దేశంలో ఆ బజారులో అసలు మనిషి నడవడు. రాజమండ్రీ ప్రజల పరోపకారబుద్ధికీ సౌజన్యానికీ ఇదొక నిదర్శనం. బజారులో మనిషికి నడవవలసిన అవసరంలేదు. మనిషిని తోసేస్తారు. 'నడిచాను' 'వెళ్ళాను' అనడానికి బదులు 'తోపుడయాను' అనడం సవ్యంగా వుంటుంది.

ఆ బజారులో వర్షం పడితే ఒక అరగజం మందాన్న బురద తయారవుతుంది. సూర్యకిరణానికి తావివ్వనంత సన్నంకావడం చేత ఆ బజారులో వర్షంమూలంగా తయారయిన బురద ఎండడం అంటూ వుండకూడదు;

కాని మొన్నాటికి పొడిగా వుంటుంది! ఆశ్చర్యంగా వుండచ్చు. కాని ఆ బజారులో నడిచే జనాభా తమ జోళ్ళకీ కాళ్ళకీ కొద్ది కొద్దిగా బురద అంటించుకొని తమతమ సెలవులకి తీసుకుపోవడం కారణంగా ఎప్పుడూ పొడిగా వుంటుంది. బజారులో ఒక సైకిలు రెండో సైకిలులోకి వెళ్లిపోయినా కాని, పై మనుషులు క్రింద పడరు; క్రింద అన్నది లేకుండా జనం నడుస్తూంటారు కనుక.

ఆ వూరు ఈతిబాధలు రెండు. బజారు చేరుకునేవరకూ 'బాబయ్యా బజారుకి బండి కట్టుతాను' అంటూనే వుంటాడు బండివాడు. మా మిత్రుడొకడు చెప్పాడు - బండివాడు "బాబయ్యా బండికట్టుతానంటే జాగ్రత్తగా మాట్లాడు. కావలిస్తే నీకు కట్టుకో, నీ తాతకి కట్టుకో అంతేకాని నాకు బండి కట్టుతానంటావేమిటి? అన్నాడట ఒకడు. బండివాడు విస్తుపోయి వెళ్లిపోయాడట." రెండో ఈతిబాధ జోళ్ళవాళ్ళు. ముష్టివాళ్ళకంటే ఎక్కువ బాధ పెట్టేస్తారు. జోళ్ళులేని వాడిని కూడా 'బాబయ్యా నాడాలు కొట్టుతా'నంటాడు. కొత్తజోడు ఆ రోజునే కొని వేసుకున్నాసరే "బాబూ జోడు బాగుచేస్తాను. మీకు తోచింది ఇవ్వండి" అంటాడు.

నామిత్రుడు మూర్తి రాజమండ్రిలో ప్లీడరుగావుంటున్నాడు. సెలవులముందు అకస్మాత్తుగాపిడుగులాంటి వుత్తరంపడేశాడు నాకు. నేను తనతో లోగడ వ్రాసుచ్చిన ప్రకారం సెలవులు పదిరోజులూ రాజమండ్రిలో గడిపి తీరవలెననీ, అట్లు గడపనిపక్షంలో తాను తన కార్యసిద్ధి కనుకూలమైన సత్యాగ్రహపద్ధతి నవలంబించ నిశ్చయించినట్లూ, నేను వచ్చేది రానిదీ తిరుగు టపాలో తెలియచేయవలెనని వ్రాశాడు. తన సత్యాగ్రహం ఏరూపం దాల్చుతుందో కూడా ముందే సూచన లిచ్చాడు. మళ్లీ నేను అతనిని కలుసుకునేవరకూ తను కాఫీ మానేస్తాడుట. అంటే మేము కాలేజీలో చదువుకునే రోజుల్లో రోజూ సాయంత్రం కాఫీ హోటలులో కూర్చుని కాఫీ పందాలు వేసుకుని మూడు నాలుగు కప్పులు త్రాగేవాళ్లం. అదొక దుర్వ్యసనంగా కూడా పరిణమించింది. రోజూ పది పన్నెండు కప్పులు త్రాగుతేనే కాని చురుకుగా మనిషిలా బ్రతకడం కష్టమైపోయింది. మే మిద్దరం ఎప్పుడు ఎక్కడ కలుసుకున్నా మా కాళ్లు వాటంతటవే కాఫీ దేవాలయంవైపు దారి తీస్తాయి. అందుచేత కాఫీ మానేయడమన్నది కఠోరదీక్షే. పైగా నిరశన వ్రతంలోకి వస్తుంది. అసంపూర్ణ నిరహార దీక్షు అన్నమాట. ఎందుచేతనో కాని నాకు సత్యాగ్రహమంటే భయం. నరాల్లోంచి కంపం పుట్టుకు వస్తుంది. స్వాతంత్ర్యం వచ్చాక కూడా ఇది ప్రజలలో మిగిలిపోవడం చాలా బాధగా వుంది. స్వాతంత్ర్యానికి ముందు ఏదో వుద్రేకంలో బాగానే వుండేది కాని తర్వాత కూడా, అందులోనూ గాంధీమహాత్ముడు సిద్ధిపొందాక, ఈ అస్త్రాలని ప్రయోగించుతూ మావంటి వాళ్ళను భయపెట్టుతూండడం ఏమంత బాగా లేదు. ఆ పరిస్థితులలో నేనేం చేశానంటే ఈ వుత్తరం అందనట్లూ అంతకు ముందే నేను సెలవుల్ని రాజమండ్రీలో గడపడానికి తన అంగీకారంమీద నిశ్చయించినట్లూ, అంతకు ముందు తేదీ వ్రాసి ఒక ఉత్తరం గీకి పారేశాను. మర్నాడు మళ్ళీ ఇంకో ఉత్తరం, అతని ఉత్తరం అందినట్లూ అందులోని సంగతులకు ఆశ్చర్యాన్ని వెలిబుచ్చుతూ ఒక జాబు గీకేశాను. అంతటితో బెంగ వదిలింది. మూర్తి చాల సంతోషించాడు, అన్నప్రకారం రాజమండ్రీ వచ్చినందుకు. ఇంటికి వచ్చి, స్నానపానాదులు కానిచ్చుకొని కొంతసేపు పిచ్చాపాటీ చెప్పుకున్నాక నేను విశ్రమించాను. మూర్తి కచ్చేరి కెళ్ళి సాయంత్రం నాలుగ్గంటలకల్లా ఇంటికి వచ్చేశాడు. కాఫీ త్రాగి ముస్తాబయూం వీధులలో పడటానికి. నేను పట్లాం, పొట్టిచేతుల బుష్ షర్టు వేశాను. అతనూ అంతేకాని పొడుగు చేతుల్ది వేశాడు. బయల్దేరుతుంటే అన్నాడు 'రిస్టువాచీ తీసి జేబులో నేనా వుంచు, ఇంట్లో నేనా వదిలేయి' అని. 'ఏం దొంగతనం జరుగుతుందంటావా' అన్నాను. 'ఆ భయం లేదులే' అన్నాడు. 'ఫాషన్ కాదు?' అన్నాను. 'అదీకాదు' అన్నాడు. 'చెప్తాను నడు' అన్నాడు.

వీధులోకి వచ్చాక అలా గోదావరి గట్టు మీదనుంచి వెడదామన్నాను. 'ఈవేళ ఏం వారం?' అన్నాడు. 'మంగళవారం' అన్నాను. 'ఇక్కడ కొన్ని ఈతిబాధలున్నాయి. అలా శాంతినివాస్‌లో ఒక కప్పు కాఫీ పోసుకొని కంభంవారి సత్రం సందులోంచి గట్టుమీద పడదామన్నాడు. అంతా అదోరకంగా వుంది. 'ఏం ఇక్కడ గట్టుమీద ముష్టివాళ్ళెక్కువా?' అని అడిగాను. 'ముష్టివాళ్లు సార్వకాలీనత, సార్వప్రదేశకత వున్న జాతి కనుక ఈతిబాధలలోకి రారు. పైగా వాళ్ల సంఖ్య రోజురోజుకీ పెరుగుతూంది. మళ్ళీ ఎన్నికలలో వాళ్ళు అధిక సంఖ్యాకులుగా తేలి, పరిపాలనాయంత్రాంగాన్ని తమచేతుల్లోకితీసుకునే అవకాశం వుంది కనుక వాళ్ళని ఏమీ అనడం మంచిదికాదు. నేను చెప్పేది చిన్న ఈతిబాధ. అక్కడ అడితీలు వున్నాయి, మనిషి కనపడితే చాలు "పుల్లలుకావాలా" అని ప్రతి దుకాణం వాడూ అడుగుతాడు. అనతిదూరంలోనే శ్మశానవాటిక వుండడంవల్ల, అక్కడ పనివున్న ప్రతివాడూ ఇక్కడే పుల్లలు కొనుక్కుపోతూండడంవల్ల, పుల్లలు అవసరమయితే తప్ప ఈ ప్రాంతంలో బ్రతకదలుచుకున్న వాడెవడూ గోదావరి గట్టు 'ఎక్కడు' అని చెప్పాడు.

శాంతినివాస్‌లో కాఫీ తాగుతూండగా రిస్టువాచీ సంగతేమి టన్నాను. 'ఏంలేదు! ఈ వూళ్లో ఎవరిచేతినైనా గడియారం కనపడితే అ/యినవాడూ కానివాడూ టైమడుగుతాడు. కొందరు అడిగి వెళ్ళిపోతూంటారు, వెనకాల వచ్చి చెప్పమన్నట్లు, అగి తెలుసుకునే టంత తీరుబడి లేనట్లూను. ఈ వూరిలో కొంచెం పరోపకార బుద్ధికల ఒకవ్యక్తి ఉన్నాడు. నేను పదకొండింటికి కోర్టుకి వెడుతుంటే మార్కెట్ దగ్గర ఇతను నిల్చుని టయిమ్ చెబుతున్నాడు ఎవరో అడుగుతేను. అల్లాగ అడుగుతూనే వున్నారు జనం, ఇతగాడు కదలకుండా చెబుతూనే వున్నాడు. నేను ఆరోజున ఆరింటివరకూ కోర్టులోనే వుండవలసి రావండవలన అక్కడ హోటలులో ఇడ్లీకాఫీ పుచ్చుకొని సినీమా చూసుకుని రాత్రి తొమ్మిదిన్నరకు ఇంటికి వస్తూంటే ఈ వెర్రిబ్రాహ్మడు అదేస్థలంలో నుంచుని అలాగే టయిము చెబుతున్నాడు. అంటే పొద్దున్న మొదలు రాత్రివరకూ ఆ మనిషి గడియార స్థంభమయి పోయాడన్నమాట. అప్పటినుంచీ నేను కనపడినవాడితోటల్లా గడియారం కనపడనీయకని చెబుతూంటాను!" అన్నాడు. బ్రతికించావురా బాబూ అని వాచీని పంట్లాం వెనకజేబులో పడేశాను.

ఇద్దరం మెల్లిగా గోదావరి గట్టెక్కాము. అక్కడ బజారులో కంటె ఎక్కువ జనం వున్నారు. "ఏం జరిగిందేమిటి ఇంతమందున్నారు" అన్నాను. మూర్తి అన్నాడు "నిన్నిందాకా ఈవేళేరోజని అడిగాను కదూ! ప్రతి మంగళవారం సాయంత్రం ఈ గట్టు ఇలాగే వుంటుంది. ఈ గట్టుచివర కిందకి ఆంజనేయస్వామి ఆలయం వుంది.

ప్రతిష్ఠమైన నంజన్‌గూడు పండ్లపొడి వారి
అగత్యమైన కుటుంబ ఔషధములు
కాస్‌మస్ కస్తూరి మాత్రలు...సీసా 0-6-0
కర్‌జక్ గోరోజన మాత్రలు... „ 0-8-0
బాలక్స్ విరేచనమగుటకు మాత్రలు... „ 0-6-0
మా మందుల పూర్తి జాబితాకు వ్రాయుడు
యునైటెడ్ కన్సర్న్, బందరు వీధి, మద్రాసు-1. విజయవాడ.

# "రాజమండ్రీ వెళ్లబోకు రంగుబట్టా కట్టబోకు"

దానికి ప్రతి మంగళవారం స్త్రీలు నారికేళములతో స్వామివారి దర్శనానికి గట్టుమీద నుంచి వెడతారు. అందుకని, విద్యార్థులు, శృంగార పురుషులు, పనిలేనివారూ, వృద్ధులూ ప్రత్యేకనిర్ణీతస్థలాలలో కూర్చొని వుంటారు. గోదావరిలోపడి ప్రాణాలువదిలేసిన జనం అంతా మంగళవారాలు పడినవారే. చరిత్ర తిరగేస్తే నీకే తెలుస్తుంది." అతని స్నేహితుల్ని కొందరిని పరియం చేశాడు. సరదాగా కాలం గడిపేశాం. గోదావరి గట్టుమీద దుమ్ములేకపోతే సాయంత్రాలు చాలా హాయిగా గడపవచ్చు.

రెండురోజులు గడిపాక అలా సినిమాకు పోదామన్నాడు మూర్తి. ఏదో అరవచిత్రం ఇప్పుడు ఆడుతూంది. అరవసినిమా నేను చూడను. ఇదివరకు ఒక అరవ సోదరుని కోరిక మన్నించటానికి అరవ చిత్రం ఒకటి చూచాను. ఎప్పటికీ పూర్తి కాలేదు. ఆఖరుకి లైట్లు వెలిగాయి. 'అమ్మయ్యా' అనుకుంటూంటే ఇంటర్వల్ అన్నాడు. పై ప్రాణాలు పైకే పోయాయి. సంత జనం సాధారణంగా పని చూసుకొని రెండో ఆట అరవ సినిమాకి పందుంపుల్ల పుచ్చుకుని పోతారుట. "ఆట పూర్తయేటప్పటికి తెల్లవారుతుందని నీకు తెలియదా! మూర్తీ! నాకు సినీమాపిచ్చి లేదు. తప్పదంటే ఇంక దేనికేనా వెడదాం కాని దీనికి వద్దు" అన్నాను.

"విమర్శ ముందు, తర్వాత నువ్వు పుట్టావోయ్! నీకు అరవ చిత్రాలయందుగల అభిమానం ఇదివరకొకసారి చెప్పావు కాని ఇప్పుడు వెళ్లడం వుద్దేశం అది కాదు. ఈ థియేటర్‌లో అరవ చిత్రం చూద్దామని అన్నాడు. 'ఏమిటి విశేషం' అన్నాను. 'తివలోతూ రుచెందుకూ' అన్నాడు. 'అయితే తప్పదన్నమాట' అన్నాను. 'నీవు హాలులో కూచోకుండానే తలనొప్పి అంటావు ఇష్టం లేకపోతేను. పదు ముందు కాఫీ సేవించివద్దాం' అని లాక్కుపోయాడు.

జనం తండోప తండాలుగా వస్తున్నారు. ఏమిటో విశేషం అర్థంకాలేదు. 'ఇక్కడ అరవచిత్రాలు బాగా చెలామణీ అవుతాయేమిటి' అన్నాను.

'మనింటిదగ్గర సినీమాలో అరవచిత్రం నడుస్తూందిగదా. ఎంతమంది చూస్తారో నీకే తెలుస్తుంది.'

'ఈ చిత్రం ఏమైనా గొప్ప స్టంటు చిత్రమా'

'అరవచిత్రాలలో ఎక్కువ తక్కువలేం వుంటాయిలే'

నాకు ఏమిటో చాలా చిరాకుగా వుంది. సినీమా బాగుండదంటాడు. అయినా విశేషం వుందంటాడు. ఎప్పుడు మొదలు పెట్టుతారా అని ఎదురుచూస్తున్నాను. చిట్టచివరకి నాయకుడో మరెవరో ఇంత ముడీవాడూ తెరమీద కూర్చుని తొడ చరిచి సరిగమపదనిసా అని పాట అందుకున్నాడు. హాలులో అంతా విసుక్కున్నారు. ఎప్పటికవుతుందీ పాట అనుకున్నారు. అరగంట తరువాత మనల్ని వదిలిపెట్టాడు. ఇంతలో తెరముందున్న అరెకరం మేరలో కూర్చున్న ముఖాలన్నీ ఒక్కమాటు గొల్లుమని నవ్వాయి. మూర్తి నాకేసి చూస్తున్నాడు ఏమిటో నాకర్థం కాలేదు. 'ఏమిటది' అన్నాను. 'ఝుమ్మారావు' అన్నాడు 'అతడెవరు' "తర్జుమారావు ఈ హాలులో వచ్చే హిందీ, అరవ చిత్రాల సంభాషణలు తర్జుమాచేస్తాడు. ఇతడి తర్జుమా చాలా గొప్పగా వుంటుందని తర్జుమారావు అని పేరు పెట్టారు. క్లుప్తంగా వుండడానికి తలకొట్టేసి ఝుమారావు అనమన్నాడు. అతడి నోట్లోంచి ఏ మాట వచ్చినా హాలంతా దద్దరిల్లేటట్లు నవ్వుతా"రన్నాడు.

సినీమా నడుస్తూన్న నాలుగు గంటలూ హాలంతా ఒకటే నవ్వు. నాకు కొంత అరవం వచ్చు. దాని ఈ చప్పుడుకి ఈ భావం అని తెలుసుకునే భాషాజ్ఞానం వుంది నాకు. కాని ఆరోజున చిత్రం అరవదనీ తెలుసుకోలేకపోయాను, తర్జుమా చేస్తున్నది తెలుగులోకనీ తెలుసుకోలేకపోయాను.

ఎలాగో ఇంటర్వల్ వరకూ కూర్చుని ఇక తలపడ్డాం. 'ఎలా వుంది' అన్నాడు మూర్తి. ఏమంటాను!

తర్వాత దారిలో చెప్పుకొచ్చాడు; ఝుమారావు కథనం. ఇతని కంఠం గంభీరమైనదీ స్వచ్ఛమైనదీ. మంచి చమత్కారంగా మాట్లాడగలడు. ప్రత్యేకం ఇతని తర్జుమా వినడానికే జనం తండోపతండాలుగా వస్తుంటారు. ఒకసారి ఒక రోజున ఝుమారావు కనిపించడంలేదని వూరంతా పాక్కిపోయింది. వారం రోజులు మనిషి పత్తా తేలలేదు. పురజనులు శ్రాద్ధాల ఘాటులో బ్రహ్మాండమైన సభ జరిపి, ఎవరో దుండగీడులు అతనిని మాయం చేశారనీ, ప్రభుత్వం తగుదర్యాప్తు తక్షణం తీసుకొని, అతనిని వెతికి రాజమండ్రీకి అప్పగించాలనీ, అతడు రాజమండ్రియొక్క సొత్తనీ పలువురు పురప్రముఖులు ఘాటుగా వుపన్యసించారు. పైవూర్ల సినీమాలన్నీ గాలించారు. చివరకి నెల రోజుల తరువాత మరో జిల్లాలో ఒక వూరులో ఒక సినిమాహాలు యజమాని అతనిని వందలు చూపించి బలవంతాన తీసుకుపోయినట్లు తెలిసింది. తక్షణం రాజమండ్రీలోని ఈ హాలు యజమాని కోర్టులో ఇంజక్షను ఆర్డరు పుచ్చుకుని అతనిని మళ్ళీ రాజమండ్రీ రప్పించాడు. ఆ రోజున కొన్ని వేలమంది 'ఝుమారావుకీ జై' అనే నినాదాలతో అతనికి ఘనమైన స్వాగతం ఇచ్చారు. అప్పటినుంచి అతనున్న హాలులో టిక్కట్టు దొరకడం కష్టం అయిపోయింది. ఇప్పుడు ఆంధ్రదేశంలో ఎక్కడ తెలుగేతర చిత్రం ప్రారంభించినా ఆరోజున ఆహాలులో కథ చెప్పడానికి ఖర్చులపైన వందరూపాయలిచ్చి ఝుమారావుని తీసుకుపోతూంటారు. పదిరోజుల ముందునుంచే 'మొదటిరోజు ఝుమారావుగారిచే కథా' అని చాటించుతూంటారు. మొదటిరోజున చాలాచోట్ల రెట్టింపు రేట్లుకూడా పెట్టడం మామూలయిపోయింది. కొంతమంది ప్రత్యేకం ఝుమారావు ఏవూరు వెడితే ఆవూరు వెళ్ళి కథ వినడంకూడా వుంది" అన్నాడు మూర్తి. మళ్లీ మొదలెట్టాడు.

'నెహ్రూని చూడడానికే వస్తారు కాని వినడానికి వచ్చేవాళ్లెవరినైనా చూశావా' అన్నాడు. ఇదేమిటి! నెహ్రూ మాటతెచ్చాడు మధ్యలో అనుకొని 'లేదు.' "అందుకనే నేను పేపర్లో వ్రాద్దామనుకుంటున్నాను. పంచవర్ష ప్రణాళికకి డబ్బు కావాలంటే నెహ్రూని ఆంధ్రదేశమంతా త్రిప్పి మీటింగులు పెట్టి టిక్కట్టులు పెట్టి ఝుమారావు తర్జుమాకూడా పెట్టిస్తే రెండు పంచవర్ష ప్రణాళికలకు కావలసిన డబ్బు పోగవుతుంది." ★

**వీర్యస్తంభన రసాయనం :** శుక్రనష్టము నాపి మంచి బలం వీర్యవృద్ధి కల్గించును. డబ్బి రూ. 5/-
**గర్భ నిరోధిని:** యిటు మీదట గర్భం రాకుండా ఆపుటకు, లోపలికి సేవించే అతి నమ్మకమైన మందు. రూ. 10/-
**నపుంసక తైలం:** చిన్నదైన అంగ నరములు, తిర్గి యథాప్రకారమై పూర్తి సౌఖ్యమును రూ. 10/-
పై వాట్కి ఖర్చులు రూ. 1-0-0 లు అగును. కావలసినచో ముందుగాపం పేది.
డాక్టర్ రత్నం సన్స్, మెడికల్ హాల్, మలకపేట బిల్డింగ్స్, హైద్రాబాద్.